
సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకుడు నల్లమోతు సిద్ధార్థ

## స్వార్థం కోసమే పార్టీ మారుతున్నారు

- బీఆర్‌ఎస్ నాయకుడు నల్లమోతు సిద్ధార్థ

మిర్యాలగూడ, మే 5 : రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న పదేండ్ల కాలంలో పదవులు అనుభవించి, అధికారం కోల్పోగానే కొంత మంది నాయకులు తమ స్వార్థం కోసం ఇతర పార్టీల్లోకి వెళ్తున్నారని బీఆర్‌ఎస్ నియోజకవర్గ నాయకుడు నల్లమోతు సిద్ధార్థ, పార్టీ సీనియర్ నాయకులు అన్నభీమోజు నాగార్జునాచారి, ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని టీఎన్‌ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. అధికార దాహంతోనే కొందరు పార్టీలు మారుతున్నారని, అసలైన కార్యకర్తలు మాత్రం బీఆర్‌ఎస్‌తోనే ఉన్నారని పేర్కొన్నారు. కొందరు స్వార్థపరులు బయటికి వెళ్లిపోయినంత మాత్రాన పార్టీకి వచ్చిన నష్టం ఏమీ లేదన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ మహా సముద్రమని, ఎందరో గొప్ప నాయకులను సృష్టించిన ఘనత పార్టీకే దక్కుతుందన్నారు. మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో తామంతా పని చేస్తామన్నారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు నాగరత్నం, గోవర్ధన్‌రెడ్డి, దొనాటి ఆశాలు, జాజుల రవి, నాగయ్య, రవి పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి యువత కృషి చేయాలి : ఎస్‌ఐ


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

త్రిపురారం, మే 5 : గ్రామాల అభివృద్ధికి యువత కృషి చేయాలని ఎస్‌ఐ కె.వీరశేఖర్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు ఐదు రోజులుగా మండలంలోని సత్యనారాయణపురం గ్రామంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ శిబిరం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్‌ఐ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ విద్య చదువుతున్న విద్యార్థులు గ్రామాల పట్ల అవగాహన పెంచుకొని రైతులకు, యువతకు మేలు చేసేలా కొత్త ఆవిష్కరణలు చేయాలన్నారు. గ్రామంలో ఐదు రోజులుగా సేవా కార్యక్రమాలను చేపట్టిన విద్యార్థులను అభినందించారు. అనంతరం విద్యార్థులు గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుమాలిని, కేవీకే అధిపతి డాక్టర్ లింగయ్య, కేవీకే శాస్త్రవేత్త చంద్రశేఖర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు రంజిత, ప్రశాంత్ పాల్గొన్నారు.

## త్రిపురారంలో హోం ఓటింగ్ పూర్తి

త్రిపురారం, మే 5: మండలంలో హోం ఓటింగ్ పూర్తయినట్లు తాసీల్దార్ గాజుల ప్రమీల తెలిపారు. మండలంలో 49 మంది వృద్ధులు, దివ్యాంగులు హోం ఓటింగ్ కోసం దరఖాస్తు చేసుకోగా..శని, ఆదివారాల్లో వారి ఇంటికి వెళ్లి ఓటు వేయించినట్లు తాసీల్దార్ పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న వారందరూ ఓటు వేశారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యప్రభ, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

**నిడమనూరులో 65 మంది**

నిడమనూరు : మండలంలో వృద్ధులు 36, దివ్యాంగులు 31 మంది హోం ఓటింగ్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆదివారం నాటికి 65 మంది ఇండ్లకు వెళ్లి వారితో ఓటు వేయించినట్లు తాసీల్దార్ జంగాల కృష్ణయ్య తెలిపారు. మరో ఇద్దరు ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉందని పేర్కొన్నారు.

**మునుగోడు మండలంలో ..**

మునుగోడు : మండలంలో రెండో రోజు హోం ఓటింగ్ ప్రక్రియ ముగిసినట్లు పోలింగ్ ఆఫీసర్ మదనయ్య తెలిపారు. మండల వ్యాప్తంగా 27 మంది దరఖాస్తు చేసుకోగా 24 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని, మరో ముగ్గురు అందుబాటులో లేరని పేర్కొన్నారు.

## సజావుగా నీట్

- 2,262 మంది విద్యార్థుల హాజరు

రామగిరి, మే 5 : మెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి దేశవ్యాప్తంగా నిర్వహించే నీట్-2024 ప్రవేశ పరీక్ష ఆదివారం నల్లగొండ జిల్లా కేంద్రంలో సజావుగా ముగిసింది. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5:30వరకు జరిగిన పరీక్షకు జిల్లా కేంద్రంలో 7 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 2,318మంది విద్యార్థులకు 2,262మంది విద్యార్థులు హాజరయ్యారు. సిటీ కో ఆర్డినేటర్ జి.పార్థసారథి పర్యవేక్షణలో పరీక్షలు సజావుగా జరిగాయి.

## జిల్లాలో పటిష్ట నిఘా : ఎస్పీ చందనా దీప్తి

నీలగిరి, మే 5 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా పోలీస్ యంత్రాంగం మద్యం, డబ్బు ఇతర వస్తువుల అక్రమ రవాణాపై పటిష్ట నిఘా ఏర్పాటు చేసి ఓటర్లను ప్రలోభాలకు గురిచేయకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎస్పీ చందనాదీప్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మూడు అంతర్రాష్ట్ర, ఐదు అంతర్ జిల్లా చెక్ పోస్టులను ఏర్పాటు చేసి క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 3,89,67,000 నగదు, 27.43లక్షల విలువైన మద్యం, 6.53లక్షల విలువగల గంజాయి, 5.73కోట్ల ఆభరణాలు, 3.73 కోట్ల ఎలక్ట్రానిక్, ఇతర వస్తువులు సీజ్ చేసినట్లు తెలిపారు. సర్వేలెన్స్ టీమ్స్, స్టాటికల్ టీమ్స్ ద్వారా ఎప్పటికప్పుడు పరవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ప్రజలంతా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు, ప్రశాంత వాతావరణం కల్పించి పారదర్శకంగా నిర్వహించేందుకు భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ తెలిపారు. వివిధ కేసుల్లో ఉన్న పాత నేరస్తులు, రౌడీ షీటర్లను 512 కేసుల్లో 943 మందిని బైండోవర్ చేసినట్లు వివరించారు. 116 లైసెన్స్‌డ్ ఆయుధాలను డిపాజిట్ చేసినట్లు తెలిపారు.


సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

## పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

మర్రిగూడ, మే 5 : మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో 2004-05 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. తమకు చదువు నేర్పించిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్వాయి జగతిరెడ్డి, పాలాది విజయమోహన్, సోమబ్రహ్మం, యాదగిరిరావు, కృష్ణయ్య, ప్రవీణ్‌కుమార్, రాములు, అనూరాధ, పూర్వ విద్యార్థులు శిలువేరు కృష్ణ, ఆకుల కృష్ణకాంత్, గ్యార యాదగిరి, జంపాల జయప్రసాద్, గునగంటి నగేశ్, రమేశ్, జమీల్, రవి, సంధ్యారాణి, పద్మ, సింధూజ, జ్యోతి, సునీత, ప్రకాశ్, లింగం పాల్గొన్నారు.

## చిన్నారి చికిత్స కోసం ఆర్థిక సాయం

నకిరేకల్, మే 5 : మునుగోడు మండలం కొరటికల్ గ్రామానికి చెందిన ఐతగోని రవి, మమత దంపతుల కుమార్తె ఆరుషి (18 నెలలు) వెన్నుపూసలో గడ్డతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. పేద కుటుంబం కావడంతో చిన్నారి చికిత్స కోసం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నరు. విషయం తెలుసుకున్న లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ సభ్యులు ఆదివారం హైదరాబాద్‌లో దంపతులను కలిసి రూ.20,200 ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ తాము 240 మంది సభ్యులు వాట్సాప్ గ్రూప్ ద్వారా ప్రతి నెల రూ.200 చొప్పున జమ చేసి వచ్చిన డబ్బులను ఆపదలో ఉన్న వారికి అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు కర్నాటి నరేశ్, బోడకుంటి శ్రీనివాస్, రవ్వ వెంకటేశ్, మందుల శేఖర్, కళావతి పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనలో ప్రజల బతుకులు ఛిద్రం

- పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజల మద్దతు బీఆర్‌ఎస్‌కే
- రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి


మిర్యాలగూడ :బోట్యానాయక్‌తండాలో ఇంటింటి ప్రచారం చేస్తున్న చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి


మాడ్గులపల్లి : ఆగామోత్కూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మిర్యాలగూడ, మే 5 : కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన ఐదు నెలల్లోనే తెలంగాణ ప్రజల బతుకులు ఛిద్రమయ్యాయని రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని భోట్యానాయక్‌తండాలో బీఆర్‌ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపించాలని కోరుతూ కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయలేక పోయారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ మాయమాటలను నమ్మి ఓటు వేసి గెలిపించినందుకు ప్రజలు బాధపడుతున్నారని, పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీకి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికలకు ప్రజల్లో ఊహించని రీతిలో మార్పు వచ్చిందన్నారు. పదేండ్ల కేసీఆర్ ప్రభుత్వ పాలనలో అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు కావడంతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. అందుకే తిరిగి బీఆర్‌ఎస్ పాలనే కావాలని ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో అందరూ కారు గుర్తుకు ఓటు వేసి కంచర్ల కృష్ణారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు జొన్నలగడ్డ రంగారెడ్డి, మిట్టపల్లి సైదులు, మాజీ ఎంపీపీ జానయ్య, రైతుబంధు సమితి మండల మాజీ అధ్యక్షుడు గడగోజు ఏడుకొండలు, నాయకులు పీసీకే.ప్రసాద్, సురేశ్, సాగర్‌నాయక్, రాంబాబు, మున్నినాయక్, కృష్ణానాయక్ పాల్గొన్నారు.

**బీఆర్‌ఎస్ గెలుపుతోనే అభివృద్ధి**

శాలిగౌరారం : పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను గెలిపించి, అభివృద్ధికి బాట వేయాలని పార్టీ మండలాధ్యక్షుడు ఐతగోని వెంకన్నగౌడ్ కోరారు. ఆదివారం మండలంలోని తుడిమిడి, గురజాల గ్రామాల్లో నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం చేపట్టారు. గత ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించి ఓటు అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు గుండా శ్రీనివాస్, కట్టా వెంకట్‌రెడ్డి, మామిడి సర్వయ్య, చెలకాని కొమరయ్య, మామిడి రమేశ్, పనికెర కమలాకర్, ఆలకుంట్ల వెంకన్న, ముత్యాల రమేశ్, గడ్డం వీరయ్య, రాచకొండ గణేశ్, బొడ్డ విజయ్ పాల్గొన్నారు.

**నార్కట్‌పల్లిలో ఇంటింటి ప్రచారం**

నార్కట్‌పల్లి : పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మలేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు ఎండీ వాజిద్, పార్టీ పట్టణ అధ్యక్షుడు దోసపాటి విష్ణుమూర్తి, నాయకులు ఐతరాజు రమేశ్, బొబ్బలి యాదగిరి, బొబ్బలి దేవేందర్, దుబ్బాక పావనీ శ్రీధర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

**బీఆర్‌ఎస్ నాయకుల ప్రచారం**

మాడ్గులపల్లి : బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పాలుట్ల బాబయ్య ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఆదివారం మండలంలోని ఆగామోత్కూర్ గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గత ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీ కోఆప్షన్ సభ్యుడు మోసిన్‌అలీ, మాజీ సర్పంచ్ అఫ్జల్, చిరుమర్తి మాజీ సర్పంచ్ వెంకటాచారి పాల్గొన్నారు.

**బీఆర్‌ఎస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం**

నల్లగొండ, మే 5: బీఆర్‌ఎస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి సతీమణి రమాదేవి అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆదివారం నల్లగొండ పట్టణంలోని వీటీ కాలనీలోని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నా, ఢిల్లీలో తెలంగాణ గొంతు వినిపించాలన్నా బీఆర్‌ఎస్ గెలువాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మెరుగు గోపి, రావుల శ్రీనివాస్‌రెడ్డి, గోవింద్‌రెడ్డి, కంచర్ల సోదరి దేశిడి శ్రీలత, రావుల రేణుక, కంచర్ల విజయ, సిరికొండ మాధవి, కుంభం రాధిక, పవన్ పాల్గొన్నారు.


నల్లగొండలో ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి సతీమణి రమాదేవి


నార్కట్‌పల్లి : ఇంటింటి ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


శాలిగౌరారం : గురజాలలో ప్రచారంలో పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకులు

## అక్రమ వసూళ్లకు పాల్పడిన కానిస్టేబుల్ సస్పెండ్

నీలగిరి, మే 5: విధి నిర్వహణలో అక్రమ వసూళ్లకు పాల్పడిన కేతేపల్లి పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ పి. మహేశ్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎస్పీ చందనదీప్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 28 ఉదయం కొర్లపహాడ్ టోల్ ప్లాజా వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న క్రమంలో విజయవాడలో శుభకార్యానికి వెళ్లి హైదరాబాద్‌కు వస్తున్న వాహనాన్ని తనిఖీ చేశారు. వాహనంలో తొమ్మిది బీర్లు ఉన్నాయని, వాహన దారులపై కేసు నమోదు చేస్తామని బెదిరించిన మహేశ్ వారి వద్ద నుంచి ఆరువేల రూపాయలు డిమాండ్ చేశాడు. పక్కనే ఉన్న పెట్రోల్ బంక్ ద్వారా ఫోన్‌పే చేయించుకొని తీసుకున్నట్లు బాధితులు ఫిర్యాదు చేయగా.. విచారణలో అది నిజమేనని నిర్ధారణ అయినట్లు ఎస్పీ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సదరు కానిస్టేబుల్‌ని సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు ఎస్పీ తెలిపారు. విధి నిర్వహణలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

## బీఆర్‌ఎస్ గుండ్రాంపల్లి గ్రామశాఖ అధ్యక్షుడిగా నర్సింహ



చిట్యాల, మే 5 : బీఆర్‌ఎస్ గుండ్రాంపల్లి గ్రామశాఖ అధ్యక్షుడిగా బత్తుల నర్సింహ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం గ్రామంలో జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో నర్సింహను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి గ్రామంలో బీఆర్‌ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. సమావేశంలో నాయకులు రాచకొండ కిష్టయ్య, కోయగూర నర్సింహ, భీమిడి చినవెంకట్‌రెడ్డి, బుస్సు భిక్షపతి, వరప్రసాద్, మహ్మద్ వాజిద్, నమ్ముల అనిల్, బొడిగె రవీందర్, వలిగొండ నరేశ్ పాల్గొన్నారు.

## ఈవీఎంల కమిషనింగ్‌ను పరిశీలించిన కలెక్టర్

నల్లగొండ, మే 5 : పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి పట్టణంలోని నాగార్జున కళాశాల ఆవరణలోని నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్ సెంటర్ వద్ద ఉన్న స్ట్రాంగ్ రూములో జరుగుతున్న ఈవీఎం కమిషనింగ్‌ను జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన ఆదివారం పరిశీలించారు. కమిషనింగ్ చేస్తున్న సందర్భంలో ఏదైనా సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయా.. అనే విషయాలను సెక్టోరల్ ఆఫీసర్లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట నల్లగొండ అసెంబ్లీ సెగ్మెంట్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఆర్‌డీఓ రవి ఉన్నారు.

**పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలి**

నల్లగొండ, మే 5 : పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల కోసం ఎన్నికల సంఘం కల్పించిన పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని, ఇందుకు ఇంకా 3 రోజులు మాత్రమే అవకాశం ఉన్నదని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల విధులకు నియమించబడిన ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కోసం నల్లగొండ జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేంద్రాలు 8వ తేదీ వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. దేవరకొండలో ఎంకేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నిడమనూరులో తెలంగాణ మోడల్ స్కూల్, మిర్యాలగూడలో కేఎన్ఎం డిగ్రీ కాలేజ్, నల్లగొండలో కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కాలేజ్, చండూరులో జడ్పీహెచ్ఎస్, నకిరేకల్‌లో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ గర్ల్స్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆమె వెల్లడించారు.


ఈవీఎంల కమిషనింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ హరిచందన

## వైభవంగా వేంకటేశ్వరుడి కల్యాణం


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మందుల సామేల్

శాలిగౌరారం, మే 5 : మండలంలోని మాదారం కలాన్ గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీదేవి, భూదేవి సమేత చర్ల వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారి కల్యాణం నిర్వహించారు. ఎమ్మెల్యేలు మందుల సామేల్, వేముల వీరేశం కల్యాణోత్సవానికి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నోముల విజయ్‌కుమార్, మాజీ సర్పంచ్ జెర్రిపోతుల మంజులా చంద్రమౌళిగౌడ్, నోముల వెంకటయ్య, నోముల రవికుమార్, తోటకూరి పరశురాములు, మాచర్ల శ్రీనివాస్, శ్రీను, చింతల శంకర్, నోముల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఆవుల రామన్న చిత్రపటానికి ఘన నివాళి


రామన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నీలగిరి, మే 5 : యువజన నాయకుడు ఆవుల రామన్న యాదవ్ రెండో వర్ధంతిని గణేశ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వీటి కాలనీ హనుమాన్ చౌరస్తాలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉత్తమ యువజన అవార్డు గ్రహీత సిరిగిరి సురేశ్‌రెడ్డి మాట్లాడుతూ రామన్న అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున, యువజన నాయకులు బత్తిని యాదగిరి, దీప నవీన్‌రెడ్డి, విజయేందర్‌రెడ్డి, భరత్, శ్రీనాథ్, గణేశ్, గోపాల్, మాంద్ర మహేశ్, శ్రీనాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఈదురు గాలుల బీభత్సం

- పలు ప్రాంతాల్లో పాక్షిక నష్టం.. కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- జిల్లా ప్రజలకు వేడి నుంచి ఉపశమనం


చిట్యాల : పిడుగు పాటుకు కాలిపోతున్న కొబ్బరి చెట్టు


కట్టంగూర్ : ముత్యాలమ్మగూడెంలో తాటిచెట్టుపై పిడుగుపాటు

నల్లగొండ, మే 5: పక్షం రోజులుగా నిప్పుల కొలిమిలా ఉన్న నల్లగొండ జిల్లా ఆదివారం సాయంత్రం కురిసిన వర్షానికి ఒక్కసారిగా చల్లబడింది. జిల్లాలో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతూ ఇటీవల 47 డిగ్రీలకు చేరువవుతుండడంతో జనం ఎండ తీవ్రతకు ఉక్కిరిబిక్కిరయ్యారు. కూలర్లు, ఏసీలు కూడా పని చేయలేని పరిస్థితి నెలకొనడంతో ఉక్కపోతతో అల్లాడారు. ఇలాంటి సమయంలో కురిసిన వర్షంతో ఊరట చెందారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో సుమారు గంటన్నర పాటు మోస్తారు నుంచి భారీ వర్షం పడింది.

**పలు ప్రాంతాల్లో వర్షం**

ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండతీవ్రత అధికంగా ఉంది. ఆ తర్వాత కొంత చల్లబడింది. సాయంత్రం వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటు చేసుకొని ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. అత్యధికంగా తిప్పర్తిలో 65.8 మిల్లీమీటర్ల వర్షం పడగా.. కేతేపల్లిలో 35.5, నార్కట్‌పల్లిలో 30.0, చిట్యాలలో 28.8, నల్లగొండలో 24.0, కనగల్‌లో 23.3, దామరచర్లలో 20.5, గుర్రంపోడ్‌లో 20.0, అనుములలో 18.0, త్రిపురారంలో 14.08, నకిరేకల్‌లో 14.5, వేములపల్లిలో 14.5, మిర్యాలగూడలో 12.3, నిడమనూరులో 10, కట్టంగూర్‌లో 10.0, శాలిగౌరారంలో 8.3, పీఏపల్లిలో 7.8, తిరుమలగిరి సాగర్‌లో 6.5, గుండ్లపల్లిలో 5.0, మాడ్గులపల్లిలో 5.0, మర్రిగూడలో 3.5, అడవిదేవులపల్లిలో 3.0, గట్టుప్పల్‌లో 2.3, చండూర్‌లో 1.0, అత్యల్పంగా చింతపల్లిలో 0.5 మి.మీ. వర్షం పడింది.

**ఈదురు గాలులకు పాక్షిక నష్టం**

జిల్లా వ్యాప్తంగా కురిసిన ఈదురు గాలులతో కూడిన వర్షానికి పలు ప్రాంతాల్లో పాక్షిక నష్టం వాటిల్లింది. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసింది. గాలిదుమారం వచ్చే సమయంలోనే రైతులు అప్రమత్తమై టార్పాలిన్లు కప్పుకున్నా, గాలి ధాటికి పాక్షికంగా తడిసింది. చిట్యాల మండలం గుండ్రాంపల్లి రామలింగేశ్వర ఆలయంలో ధ్వజస్తంభంతో పాటు గ్రామంలో ఏర్పాటు చేసిన హోర్డింగ్స్, రేకులు కూలాయి. చిట్యాల, కట్టంగూర్, కేతేపల్లి, గుర్రంపోడులో పిడుగు పడగా తాటిచెట్లు కాలిపోయాయి. ప్రాణనష్టం జరుగలేదు. మర్రిగూడ మండలంలోని పలు గ్రామాల్లో ఈదురు గాలుల ధాటికి విద్యుత్ స్తంభాలు కూలడంతో పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచింది. చండూర్ మండలం ఉడుతపల్లిలో పిడుగు పడి ఆవు, సంస్థాన్‌నారాయణ పురం మండలం గుజ్జ గ్రామంలో పిడుగు పడి రెండు ఆవులు మృత్యు వాత పడ్డాయి.


నల్లగొండ జిల్లా కేంద్రంలో కురుస్తున్న వర్షం


మర్రిగూడ : తిరుగండ్లపల్లిలో రోడ్డుపై విరిగి పడిన చెట్టు


చిట్యాల : గుండ్రాంపల్లి ఆలయంలో కూలిన ధ్వజస్తంభం